క్లుప్తంగా

పాపం దివ్యాంగులు



వీల్‌చైర్‌లో వెళ్తూ..

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. సోమవారం నుంచి అధికారులు ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఐదు మండలాలకు చెందిన 2,133 మంది తమ సర్టిఫికెట్లను చూపించారు. ఈ నేపథ్యంలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారు ఆందోళన చెందుతున్నారు. తమ పెన్షన్‌ను నిలిపివేస్తారోననే భయం పట్టుకుంది. ఇదిలా ఉండగా దూరప్రాంతాల నుంచి వచ్చే దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సహాయకులుగా కుటుంబ సభ్యులు ఎవరూ లేని వారు బంధువులు లేదా స్నేహితులను బతిమిలాడుకుంటున్నారు. నడవలేని పరిస్థితుల్లో ఉన్న వారిని కుటుంబ సభ్యులే వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం



మందులు అందజేస్తున్న డాక్టర్

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో బుధవారం మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో వెంకటాచలం పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ వైద్యులు శ్రీనివాసులు నాయుడు పాల్గొని పలు గేదెలకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వాటికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు పోతురాజు, శ్రావణ్‌కుమార్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమంత వాహనసేవ



పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్ శ్రీదేవి, భూదేవి కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లను హనుమంత వాహనంపై ఊరేగించారు. ఉదయం వివిధ పూజా కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి 7.30 గంటలకు గరుడ వాహనసేవ, 8 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ బి.మాలకొండారెడ్డి, అల్లూరు రమణయ్య తదితరులు పర్యవేక్షించారు.

మోడల్ స్కూళ్లపై అభ్యంతరాలుంటే తెలపండి

మనుబోలు: కొత్తగా ఏర్పాటు చేయనున్న మోడల్ స్కూళ్లపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. గురువారం పాఠశాలల్లో ఎస్‌ఎంసీ సమావేశాలు నిర్వహించి తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అభ్యంతరాలను తమకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఆదిశేషయ్య, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మనుబోలు: బీసీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలకు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జలజాక్షి కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. 2024 – 25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం బ్యాంక్ లింకేజీ ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తుందన్నారు. మీ–సేవ కేంద్రాల్లో లేదా స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంకా రెడ్డి సామాజికవర్గానికి చెందిన నిరుద్యోగులకు మండల కేంద్రంలో జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేసుకునేందుకు ఒక యూనిట్‌కు అవకాశం ఉందన్నారు. ఆధార్, కులం, ఆదాయ, విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కేన్సర్‌పై అవగాహన

విడవలూరు : కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ బి.సుజాత కోరారు. స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తుగా కేన్సర్‌ను గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. అధ్యాపకులు ఐఎస్ చక్రపాణి, షణ్ముగం పాల్గొన్నారు.

వంతెన లేక.. ఏరు దాటలేక

నిత్యం సముద్రతీరానికి వెళ్లి వేటాడడం.. వచ్చిన మత్స్య సంపదతో కుటుంబాన్ని పోషించుకోవడం.. ఇది మండలంలోని గంగపట్నం మజరా పల్లిపాళెం గంగపుత్రుల జీవన విధానం. గ్రామానికి సముద్రతీరానికి మధ్య ఉప్పుకాలువపై ఉన్న వంతెన నాలుగేళ్ల క్రితం వరదలకు కూలిపోయింది. దీంతో గ్రామం నుంచి సముద్రతీరానికి వెళ్లేందుకు గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు.

- గంగపట్నం ఉప్పుకాలువపై కూలిన వంతెన
- ఇబ్బందులు పడుతున్న గంగపుత్రులు, గ్రామస్తులు

ఇందుకూరుపేట: గంగపట్నం మజరా పల్లిపాళెం గ్రామంలో సుమారు 350 కుటుంబాలు ఉండగా సింహభాగం వేటపై ఆధారపడి జీవనం సాగిస్తారు. దీంతో వారు రోజూ సముద్రతీరానికి వెళ్తుంటారు. వీరితో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నం చాముండేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అక్కడి నుంచి సమీపాన ఉన్న సముద్రతీరానికి వెళ్లి సేదతీరుతుంటారు. ఏరు ఈ ప్రాంతంలో సముద్రంలో కలుస్తూ ఉండడంతో దీనిని చూసేందుకు పర్యాటకులు సైతం వస్తుంటారు. అలాగే కాలువ దాటుకొని కొందరు రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు.

22 ఏళ్ల క్రితం

పల్లిపాళెం వాసుల కోసం 2003న ఉప్పుకాలువపై సుమారు రూ.20 లక్షలు వెచ్చించి వంతెనను నిర్మించారు. నాలుగేళ్ల క్రితం వరదల సమయంలో ఈ ప్రాంత వాసులు తీవ్రంగా నష్టపోయారు. ఆక్వా చెరువులు, పొలాలు కొట్టుకుపోయాయి. ఇదే సమయంలో కాలువపై ఉన్న వంతెన పడిపోయింది. అప్పటి నుంచి ఈ ప్రాంత వాసులు సాగరతీరానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది కాలానికి గ్రామస్తులు తాళ్లు, కర్రల సాయంతో తాత్కాలికంగా వంతెనను ఏర్పాటు చేసుకున్నారు. అయితే కొన్ని రోజులకే అది తెగిపడిపోయింది.

ప్రమాదకరంగా..

గ్రామస్తులు ఇక గత్యంతరం లేక చేపల చెరువుల వద్ద మేతలు వేసేందుకు వేసే ఫ్లోట్ అనే సాధనంపై ప్రమాదకరంగా వెళ్లి వస్తున్నారు. అదుపుతప్పి నీటిలో పడితే లోతు అధికంగా ఉండడంతో ప్రమాదంలో చిక్కుకోవాల్సిందే. అలాగే ఈ నీటిలో అడుగున గుల్లలు ఉండడంతో కాలుపెడితే తెగిపోతాయి. సముద్రంలో వేటాడి తిరిగి సరుకును తీసుకొచ్చే సమయంలో మరింత ఇబ్బందులు పడుతున్నారు. దీంతో యుద్ధప్రాతిపదికన ఉప్పుకాలువపై వంతెనను ఏర్పాటు చేయాలని స్థానికులతో పాటు పర్యాటకులు, భక్తులు, రైతులు కోరుతున్నారు.

ఉప్పుకాలువపై కూలిపోయిన వంతెన



వేటకు ఇబ్బందిగా ఉంది



పల్లిపాళెం గ్రామానికి సముద్రతీరానికి మధ్య ఉన్న ఉప్పుకాలువపై వంతెన పడిపోయింది. దీంతో వేటకు వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నాం. ప్రధానంగా వేటకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో వలకు పడిన సరుకును తీసుకొచ్చేందుకు అవస్థలు పడుతున్నాం.

– కె.జయరామయ్య, గంగపట్నం పల్లిపాళెం

నాలుగేళ్ల క్రితం కూలిపోయింది



నిత్యం గ్రామస్తులు ఊరి నుంచి సముద్రం వద్దకు వెళ్తారు. నాలుగేళ్ల క్రితం వచ్చిన వరదలకు ఉప్పుకాలువపై ఉన్న బ్రిడ్జి పడిపోయింది. అప్పటి నుంచి గ్రామస్తులు ఒడ్డుకు చేరాలంటే ఇబ్బంది పడుతున్నారు. వెంటనే వంతెన ఏర్పాటు చేయాలి.

– జి.కృష్ణమోహన్, గంగపట్నం పల్లిపాళెం



కాలువను దాటేందుకు ప్రమాదకర స్థితిలో వెళ్తున్న గ్రామస్తులు



ఉప్పు కాలువ

8న మండల సర్వసభ్య సమావేశం

వెంకటాచలం: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 8వ తేదీన వెంటాచలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ కల్పన బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు, విద్య, వైద్యారోగ్య, వ్యవసాయ తదితర శాఖలపై సమీక్ష నిర్వహిస్తారని, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

దాడి చేశారని ఫిర్యాదు

పొదలకూరు: మండలంలోని నేదురుమల్లిలో కర్నాటి రవీంద్ర అనే వ్యక్తిపై అదే గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన శింగయ్య మరికొందరు దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు అందడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్‌కే హనీఫ్ కథనం మేరకు.. రవీంద్ర ఎస్సీకాలనీకి పని నిమిత్తం బైక్‌పై వెళ్లాడు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని దాడికి పాల్పడ్డారని అతను ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఈ–క్రాప్ బుకింగ్ పరిశీలన



కోవూరు: మండలంలో ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆర్డీఓ అనూష బుధవారం పరిశీలించారు. కోవూరు సచివాలయం–2 పరిధిలో రీసర్వే జరుగుతుందని, వాటిని రైతులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. విమర్శలు రాకుండా అధికారులు సర్వే చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ నిర్మలానందబాబా, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించినట్లు కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. యూత్ వింగ్ అధ్యక్షుడిగా దువ్వూరు కృష్ణతేజారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వెంబేటి సంధ్యారాణి, రైతు విభాగం అధ్యక్షుడిగా మారంరెడ్డి ప్రదీప్‌కుమార్ రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులుగా గుండ్ల ఆదినారాయణ, పాముల శ్రీనివాసులు, తుపాకుల గిరి, ఎస్‌కే అబ్దుల్ రహీమ్, రోశయ్య యాకోబ్, పంచాయతీ రాజ్ విభాగానికి టంగుటూరు పద్మనాభరెడ్డి, ఆర్‌టీఐ వింగ్‌కు దేవరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, వలంటీర్ల వింగ్‌కు దర్శిగుంట సాగర్‌కుమార్, గ్రీవెన్స్ సెల్‌కు కొప్పోలు దయాకర్, వాణిజ్య విభాగానికి ఆదూరు వెంకటసుబ్బయ్య, వీవర్స్ వింగ్‌కు పముజుల శంకరయ్య, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా దువ్వూరు గంగాధర్‌రెడ్డి, అంగన్‌వాడీ విభాగానికి పి.శకుంతలమ్మ, లీగల్ సెల్‌కు కాటాబత్తిన శ్రీనివాసులు, సోషల్ మీడియాకు గుంజీ రమేష్, ఐటీ వింగ్‌కు రావుల ఇంద్రసేన్‌గౌడ్, పబ్లిసిటీ వింగ్‌కు దాసరి మహేంద్రవర్మ, బూత్ కమిటీకి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, దివ్యాంగుల విభాగానికి కాకి రవి నియమితులయ్యారు.

కోవూరు నుంచి..

కోవూరు: నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. వారిలో యూత్ విభాగానికి నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి, రైతు విభాగానికి పిడుగు మధు, ఎస్సీ సెల్‌కు అనపల్లి ఉదయ్‌భాస్కర్, మైనారిటీ విభాగానికి షేక్.అబ్దుల్ రెహమాన్, విద్యార్థి విభాగానికి జడ్డ సాయికుమార్, పంచాయతీరాజ్ విభాగానికి గూడూరు జయరామయ్య, మున్సిపల్ విభాగానికి షేక్.షాహుల్, గ్రీవెన్స్ సెల్‌కు సీరం నవీన్‌కుమార్, దివ్యాంగుల విభాగానికి వేటగిరి జనార్దన్, బూత్ కమిటీలకు కొండూరు లక్ష్మీనారాయణరెడ్డిలను నియమించారు.

జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

కొడవలూరు: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) మోహన్‌రావు నార్తురాజుపాళెం సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇండస్ట్రీస్, సిటిజన్ మిస్సింగ్, అక్షరాస్యత సర్వేల గురించి పలు ప్రశ్నలడిగారు. ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొడవలూరు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి 15వ ఆర్థిక సంఘ నిధుల వినియోగం, బోర్‌వెల్స్ ఫిర్యాదులకు సంబంధించిన రికార్డులు, ఇతరత్రా కార్యాలయ రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ప్రభుత్వపరమైన అన్ని రికార్డులు పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, కార్యాలయ సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఈఓపీఆర్డీ సాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి విజయ్ ఉన్నారు.

పాఠశాలల సందర్శన

కోవూరు: కోవూరులోని పలు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లోనే తయారు చేయాలని, పదో తరగతి విద్యార్థుల విషయంలో జాగ్రత్తలు వహించాలని తెలిపారు. బాగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని పిల్లలకు సూచించారు.

కాకాణి పరామర్శ

వెంకటాచలం: మండలంలోని పుంజులూరుపాడు గ్రామ ఉప సర్పంచ్ మారు రఘురామిరెడ్డి కర్మక్రియలకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. రఘురామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, రావి బాలకృష్ణప నాయుడు, నరసప్పనాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, కాంబాబురెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయి చేష్టలకు పాల్పడితే చర్యలు

కోవూరు: ఆకతాయి చేష్టలకు పాల్పడితే చర్యలు తప్పవని కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ హెచ్చరించారు. రెండురోజుల క్రితం కోవూరు ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో కొందరు పులి బొమ్మను కంపచెట్ల మధ్య ఉంచి పులి సంచరిస్తున్నట్లు పుకార్లు పుట్టించారని, ఇందులో వాస్తవం లేదన్నారు. ఇలాంటివి మరోసారి జరిగితే చర్యలు తప్పవని ఆయన బుధవారం హెచ్చరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు : ప్రజలు తమ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ హోదాలో కోవూరు సీహెచ్‌సీలో బుధవారం ఆమె సమీక్ష సమావేశం జరిపారు. తొలుత వైద్యసేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఫ్రీజర్ లేదన్న విషయం తెలుసుకుని వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఫ్రీజర్, వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మెడిసిన్ కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. గత కొన్ని నెలలుగా సెలవులో ఉన్న గైనకాలజిస్ట్ స్థానంలో కొత్తవారి నియామకంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం మండలంలోని పడుగుపాడులో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్డును ఆమె ప్రారంభించారు. ఇక్కడ డిగ్రీ కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

వల్లూరులో ఎమ్మెల్యే పర్యటన

ముత్తుకూరు: మండలంలోని వల్లూరులో బుధవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పర్యటించారు. నూతన పశువైద్య భవనాన్ని, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులోగా ఎస్సీ, ఎస్టీలకు ఆధార్, రేషన్‌కార్డులు, పెన్షన్లు మంజూరు చేయించే బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. ఇందుకు తహసీల్దార్, ఎంపీడీఓలు కూడా కృషి చేయాలన్నారు.

నాడు విద్యాదాత.. నేడు నేత్రదాత



రామకృష్ణయ్య(ఫైల్)

విడవలూరు: స్థానిక పీర్లచావిడి సెంటర్‌లోని ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు మడపత్తి రామకృష్ణయ్య (97) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. కుమారుడు రవీంద్ర కోరిక మేరకు ఆయన నేత్రాలను మనసేవా సంస్థ చైర్మన్ దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మాడరన్ ఐ హాస్పిటల్‌కు దానం చేశారు. రామకృష్ణయ్య మృతి పట్ల పలువురు నేతలు విచారం వ్యక్తం చేశారు.

మహిళతో అనుచిత ప్రవర్తన

పొదలకూరు: మండలంలోని వరదాపురం గ్రామానికి చెందిన రాపూరు రవీంద్ర అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని సోంపల్లి విజయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై ఎస్‌కే హనీఫ్ బుధవారం కేసు నమోదు చేశారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణం

మనుబోలు: మనుబోలు పంచాయతీ పరిధిలో రూ.1.3 కోట్ల వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనా నాయక్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కోదండరామపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పెద్ద చెరువు సమీపంలోని శ్మశానవాటిక ఆవరణలో ట్యాంక్‌ను నిర్మిస్తామన్నారు. ఇప్పటికే కండలేరు వద్ద ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు చేసి ఉన్నామని, ట్యాంక్ నిర్మించాక పైప్‌లైన్‌తో దానిని అనుసంధానం చేస్తామని తెలిపారు. వారంలోపే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.

రహదారి భద్రతపై ర్యాలీ



కొడవలూరు: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో బుధవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ముంతాజ్ బేగం, ఏపీఓ ఫణి ప్రియకుమార్, ఏఓ గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

కోవూరు: కోవూరులోని పలు ఎరువుల దుకాణాలను నెల్లూరు వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీ మమత బుధవారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. ఏఓ ఇందిరావతి ఉన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందయ్యా..



గ్రామస్తులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- కాకాణి వద్ద జనం ఆవేదన

పొదలకూరు: మీ ఓటమితో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందయ్యా అంటూ మండలంలోని మహ్మదాపురం గిరిజనులు మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మృతిచెందిన బొడ్డు చినమస్తాన్‌రెడ్డి, మారు రఘురామిరెడ్డిల దశదిన కర్మకు బుధవారం కాకాణి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు, గ్రామస్తులు పెద్దఎత్తున ఆయన్ను కలిసి తప్పు జరిగిపోయిందని, గ్రామాలు వెనుకబడుతున్నాయని వెల్లడించారు. గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అధైర్యపడొద్దని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం కావడం ఖాయమన్నారు. ఆగిపోయిన అభివృద్ధిని మళ్లీ చేపట్టడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, నాయకులు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, కరిపరెడ్డి కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, తిరుపాల్‌రెడ్డి తదితరులున్నారు.

చిన్నారుల్లో నైపుణ్యాల పెంపునకు దోహదం



సూచనలిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొడవలూరు: చిన్నారుల్లో నైపుణ్యం, ఎదుగుదలను మెరుగు పరిచేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడతాయని సర్పంచ్ నాగిరెడ్డి సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని గౌతమ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్(ఈసీఈ) డేను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా తల్లులు సహకరించాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ మాట్లాడుతూ ఇక్కడ ఆట పాటలతో విద్యనభ్యసించే కిట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళా పోలీస్ ఆర్.తేజస్విని, వెల్ఫేర్ సహాయకురాలు శశి ప్రియదర్శిని, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రాధిక, ఎం.మమత, పి.ఉమ, బి.ప్రియదర్శిని పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు షాహుల్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు మోర్ల జయంతి పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. బుచ్చి రూరల్ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు బిట్రగుంట ప్రమీలమ్మ, షకీల, అనంతమ్మ, కె.యానాదిరెడ్డి, కె.బాలశంకర్‌రెడ్డి, మోర్ల భరత్, మేనకూరు సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

వెన్నుపోటుదారుల వ్యాఖ్యలు అర్థరహితం

- పార్టీ మారిన కౌన్సిలర్లు రాజీనామా చేయాలి
- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు



మాట్లాడుతున్న వీరి చలపతిరావు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్‌సీపీ గుర్తుతో ఎన్నికల్లో గెలుపొంది నేడు అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం, కొడవ లూరు, విడవలూరు మండలాల పార్టీ కన్వీ నర్లు, బుచ్చి కౌన్సిలర్లతో నెల్లూరు డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. బుచ్చి నగర పంచాయితీలో జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికలో తమ పార్టీ జారీ చేసిన విప్‌ను కొందరు కౌన్సిలర్లు ధిక్కరించారని, వారిపై అనర్హత వేటు వేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలుపొంది అధికార పార్టీకి మద్దతు తెలిపిన కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, బెజవాడ వంశీధర్‌రెడ్డి తమ పార్టీలో పదవులు పొంది ఇప్పుడు టీడీపీలోకి వెళ్లి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వంశీధర్‌రెడ్డి ప్రస్తుతం తిరుగుతున్న కారు విడవలూరులోని ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తికి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సదరు కారుకు ఎల్లో నంబర్‌ప్లేట్‌ను తొలగించి వైట్ నంబర్‌ప్లేట్ వేసుకుని దర్జాగా తిరుగుతున్నారని, ఆర్టీఓ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తమ నాయకుడు ప్రసన్నకుమార్‌రెడ్డి 2012లో ఎమ్మె ల్యే పదవికి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరి తిరిగి ఎన్నికల్లో గెలిచిన వ్యక్తి అని.. మీలా ఒకపార్టీ గుర్తుపై గెలిచి పదవిలో కొనసాగుతూ రాజీనామా చేయకుండా వేరే పార్టీలో కొనసాగడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇలా వ్యవహరిస్తున్న వారు తమ నేతలు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సమావేశంలో పార్టీ నేత మేనకూరు సీతారామిరెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్, మండల కన్వీనర్లు సతీష్ రెడ్డి, షాహుల్, శేషగిరిరావు, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.